వసతులు లేక అవస్థలు

- శిథిలావస్థలో 'రిసోర్స్ సెంటర్
- కొత్త భవనానికి నోచుకోక ఇబ్బందులు
- 22 ఏళ్లు గడిచినా నీటి వసతి కూడా లేని వైనం
- ఇదీ'మండల రిసోర్స్ సెంటర్' భవన దుస్థితి'







శేరిలింగంపల్లి మండల రీసోర్స్ సెంటర్ భవనం, సమావేశం హాల్ గుమ్మం చెదలు పట్టిన దృశ్యాలు

శేరిలింగంపల్లి: మండల స్థాయిలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పేలా చేయడంలో, ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ, సమావేశాలకు కేంద్రమైన రిసోర్స్ సెంటర్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు దిక్సూచిగా నిలుస్తోంది. అలాంటి కేంద్రంలో కనీస వసతులు లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం వస్తే లీకేజీల కారణంగా జలమయమవుతోంది. శేరిలింగంపల్లి మండల రిసోర్స్ సెంటర్ మండలలోని అన్ని పాఠశాలలను పర్యవేక్షించే మండల విద్యాధికారికి కూడా ఇదే ప్రధాన కార్యాలయం గా ఉంటోంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ, సమావేశాలకు, పాఠ్యపుస్త కాల నిల్వను ఈ కేంద్ర లోనే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చెంతనే ఐటీ సంస్థ లు, ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యా సంస్థలు ఉన్నా మండల రీసోర్స్ సెంటర్ పరిస్థితి మరీ దయనీయంగా ఉండటం విడ్డూరం.. ఈ రిసోర్స్ సెంటర్ భవనాన్ని నిర్మించి సుమారు 22 ఏళ్లు గడిచింది. అప్పటి నుంచి భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ భవనానికి మోక్షం లభిస్తుందా...? స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మండల పరిధిలో 13 జిల్లా పరిషత్ హైస్కూల్స్, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 43 ప్రాథమిక పాఠశాలలు పనిచేస్తున్నాయి.

- ఈ 59 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 16 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 370 మంది టీచర్లు పనిచేస్తున్నారు.
- అయితే ఆయా పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించే మండల రీసోర్స్ సెంటర్ పరిస్థితి మాత్రం అధ్వాన్నంగా మారింది.

ప్రైవేట్ స్కూల్‌లో....

- మండల పరిధిలో 300 వరకు ప్రైవేట్ స్కూల్స్ ఉండగా వాటిల్లో సుమారు 95 వేల మందికి పైగా విద్యార్థులు విద్యాబుద్దులు నేర్చుకుంటున్నారు.
- ఆయా స్కూల్స్‌లో ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణ, ఇతర విద్యాసంబంధమైన తదితర వాటిని కూడా పర్యవేక్షణ బాధ్యత కూడా మండల రీసోర్స్ సెంటర్ ద్వారానే ఎంఈఓ చేస్తుంటారు.

రీసోర్స్ సెంటర్‌లో సమస్యలు ఇవీ..

- మండల రీసోర్స్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది.
- చిన్న వర్షం వస్తే చాలు లీకేజీలతో ఇబ్బంది పడాల్సిన దుస్థితి.

కేంద్రానికి నీటి వసతి లేక నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

- కేంద్రంలో ఉన్న టాయిలెట్లను కూడా వినియోగించుకోలేని పరిస్థితి. దీంతో ఆయా టాయిలెట్ల డోర్లు దెబ్బతిన్నాయి.

ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే పుస్తకాలు ఇక్కడే నిల్వ చేయడం ఆనవాయితీగా వస్తోంది.. దీంతో వాటిలో లీకేజీతో తడిచిపోయే ప్రమాదం కూడా నెలకొంది.

తక్షణం చేపట్టాల్సిన పనులివీ...

- శేరిలింగంపల్లి మండల రీసోర్స్ సెంటర్‌కు మరమ్మతులకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాలి.
- పూర్తి స్థాయిలో లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.
- నీటి వసతి కల్పించి, టాయిలెట్లను అందుబాటులోకి తేవాలి

పెయింటింగ్ చేయించాలి

- అదనంగా మరో భవనం నిర్మించి అక్కడ సమవేశాలు, శిక్షణ కార్యక్రమాలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.
- ప్రహరీ నిర్మాణం చేపట్టాలి

ఆర్ట్‌గ్యాలరీలో నేడు రెండు చిత్రప్రదర్శనలు ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో నేటి నుంచి రెండు చిత్రప్రదర్శనలను నిర్వహించనున్నారు. చిత్రకళాకారుడు వి.లక్ష్మణ్ వేసిన చిత్రాలను 'నేచర్ విత్ హ్యూమన్' ఫేస్ పేరిట ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రదర్శన రెండు రోజుల పాటు కొనసాగనుంది. 41 మంది అంగవైకల్యం కలిగిన చిత్రకళాకారులు వేసిన చిత్రాలను మూడు రోజుల పాటు ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనలను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



సబిత్రిబాయి (ఫైల్)

గచ్చిబౌలి: వివాహిత అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... జార్కండ్ రాష్ట్రం, పురియో గ్రామానికి చెందిన సబిత్రిబాయి జయభేరి మెడోస్‌లో నివాసముండే సంజయ్ చతుర్వేది ఇంట్లో సత్యమ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఏజెన్సీ ద్వారా మార్చి 24న పని చేసేందుకు వచ్చింది. గురువారం ఉదయం సంజయ్ చతుర్వేది ఆఫీస్‌కు వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉంటుంది. మధ్యాహ్నం చతుర్వేది కుమారుడు అర్మాన్ ఇంటికి వచ్చి చూడగా సబిత్రిబాయి కనిపించలేదు. దీంతో అతను తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆమె ఫోన్‌కు కాల్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 45, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 65, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

కమిటీ రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- న్యాయబద్ధంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- హెచ్‌సీయూ పరిపాలనా భవనం ఎదుట ఎస్ఎఫ్ఐ, స్టూడెంట్స్ యూనియన్, ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో చోటు చేసుకున్న ఘటనలపై వేసిన కమిటీ తక్షణం రద్దు చేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ఎదుట స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టేందుకు కమిటీని వేయడం స్వాగతిస్తామని, కానీ ఒక వర్గానికి మద్దతు ఇచ్చే వారికి ఇందులో చోటు కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. వెంటనే ప్రస్తుత కమిటీని రద్దు చేసి వెంటనే కొత్తగా న్యాయబద్దంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంపై సిఫార్సు చేసే వారికి కమిటీలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, నాయకులు మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

చేవెళ్ల ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యూ) పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ చాంద్ పాషా, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేశారు. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలు కాగా... రెండోరోజు మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో నియోజకవర్గానికి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శశాంక ప్రకటించారు.



బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ తరపున నామినేషన్ వేస్తున్న మేకల భిక్షపతి

స్టార్ ఆస్పత్రిలో 'స్టార్ ఫ్యాటీ లివర్ క్లినిక్ ప్రారంభం



స్టార్ ఫ్యాటీ లివర్ క్లినిక్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జి. శ్రీనివాసరెడ్డి

రాయదుర్గం: స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 'స్టార్ ఫ్యాటీ లివర్ క్లినిక్'ను శుక్రవారం ప్రారంభించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో దీనిని ఏర్పాటు చేశారు. లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అధునాతన రోగ నిర్ధారణతో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యాధునిక చికిత్సలను అందించడం ద్వారా అనువైన లివర్ ఆరోగ్య సంరక్షణను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రారంభ కార్యక్రమంలో ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్ట్ డాక్టర్ జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అధునాతన రోగ నిర్ధారణ పరికరాన్ని అందించడం ద్వారా తాము కాలేయ ఆరోగ్యాన్ని వేగంగా అంచనా వేయడం ద్వారా తగిన చికిత్స చర్యలను ప్రారంభించామన్నారు. సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ స్టార్ ఫ్యాటీ లివర్ క్లినిక్ స్థాపన మెరుగైన కాలేయ ఆరోగ్య నిర్వహణలో తమ బద్ధతను నొక్కి చెపుతుందన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి వారికి అవసరమైన అవగాహన సాధనాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, వైద్య బృందం పాల్గొన్నారు.

23 మంది ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు



మియాపూర్: ప్రధాన రహదారిపై యూటర్న్‌ల వద్ద అడ్డదారిలో వస్తున్న 23 మంది ద్విచక్రవాహనదారులపై మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శుక్రవారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో రాంగ్ సైడ్ డ్రైవ్ అండ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యూటర్న్ వద్ద అడ్డదారిలో వచ్చే 13మంది వాహనదారులపై, జాతీయ రహదారి దీప్తీశ్రీనగర్ యూటర్న్ వద్ద అడ్డదారిలో వెళ్తున్న 10 మంది వాహనాదారుల కేసులు నమోదు చేశారు. ప్రధాన రహదారిపై వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే చలాన్లు విధించడమేగాక కేసులు నమోదు చేసాకతమని ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ హెచ్చరించారు.

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

గచ్చిబౌలి: భార్యతో గొడవపడి మనస్తాపానికిలోనై భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్రకు చెందిన చెన్నప్ప(32) కూలీ పనులు చేసుకుంటూ గౌలిదొడ్డిలోని వివేకానందనగర్‌కాలనీలో భార్య మాధవితో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను మద్యానికి బానిస కావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం అతడి భార్య మాధవి కూలీ పనులకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న చెన్నప్ప పైకప్పు రాడ్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటి వారి సమాచారంతో ఆమె ఇంటికి వచ్చి చూడగా చెన్నప్ప అప్పటికే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు కోరారు. గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి నివాసంలో నీలం మధు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అలరించిన సంగీత కచేరి

మాదాపూర్: కళాకారులు సంగీత విభావరి కార్యక్రమంతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం శ్రీవాగ్దేవి సంగీత శిక్షణాలయం శిష్యబృందం సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్వేత, శరణ్య, భార్గవి, అపర్ణ, తదితరులు సంకీర్తనలను అలపించి అలరించారు. ఇందులో సీతమ్మ మాయమ్మ, ప్రణమామ్యహం, జగదానందకారక, బ్రోవభారమ, అన్నపూర్ణే, సుమనస, ఆధిలక్ష్మి, శ్రీమన్నారాయణ, ఇదిగో భద్రాద్రి, పాహిరమాప్రభో తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్ పవన్ సింగ్, మృదంగం శ్రీకాంత్, ఘటం వెంకటేశ్ తదితరులు సంగీత సహకారాన్ని అందించారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో సంగీత కచేరి దృశ్యం

రాజేంద్రనగర్ డిపోలో 'లక్షే లక్ష్యం చాలెంజ్' ప్రారంభం

రాజేంద్రనగర్ : ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని చాలెంజ్‌లను రాజేంద్రనగర్ డిపో పూర్తి చేసిందని, ఇప్పుడిచ్చిన 'లక్షే లక్ష్యం' చాలెంజ్‌ను కూడా టీమ్ రాజేంద్రనగర్ ఖచ్చితంగా పూర్తి చేస్తుందని రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్ అన్నారు. రాజేంద్రనగర్ డిపోలో శుక్రవారం 'లక్షే లక్ష్యం' కార్యక్రమాన్ని ఆయన అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, ఎస్టీఐ సుశీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గత కొన్నేళ్లుగా టీఎస్ఆర్టీసీ సంస్థలో ఎన్నెన్నో కొత్త పథకాలు, చాలెంజ్‌లను నిర్వహిస్తూ.. ఆర్టీసీ సంస్థను ప్రజలకు చాలా దగ్గర చేశారన్నారు. దీనిలో భాగంగా ఇప్పుడు మరొక చాలెంజ్‌ను తీసుకొచ్చారన్నారు. ఈ చాలెంజ్ పేరు ''లక్షే లక్ష్యం'' చాలెంజ్ ఈ సంవత్సరం ఉగాది- 2024 నుంచి మరుసటి సంవత్సరం ఉగాది- 2025 వరకు అమలుల్లో ఉంటుందన్నారు. ఏడాది పాటు ప్రతి డిపోలో ఇస్తున్న ఎర్నింగ్స్‌కు అదనంగా ప్రతిరోజు ఒక లక్ష రూపాయలను తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాన్ని అందుకునేలా కృషి చేయాలని ఉద్యోగులకు తెలియజేశారు.

రంజిత్ రెడ్డి విజయానికి కృషి చేయాలి



మియాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



చందానగర్‌లో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం రాత్రి ఆయన చందానగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేవెళ్లలోనే కాకుండా రాష్ట్రంలో తిరుగులేదన్నారు. భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్, సునీత, రామచందర్‌రాజు, అలీ, సంజీవరెడ్డి, ఇలియాస్‌షరీఫ్, వీరేందర్‌గౌడ్, సౌందర్యరాజన్, శేఖర్‌రెడ్డి, అజీమ్, హరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

హస్తం గుర్తుకు ఓటువేసి చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వి.జగదీశ్వర్‌గౌడ్ కోరారు. డివిజన్ పరిధిలోని మియాపూర్ గ్రామంలో డాక్టర్ రంజిత్ రెడ్డి తనయుడు ఆర్యన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులందరికి అందే విధంగా కృషి చేస్తామన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలియాషరీఫ్, వీరేందర్‌గౌడ్, సాంబశివరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం....

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప, సందయ్యనగర్‌లలో శుక్రవారం కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ అందించి ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామచంద్రరాజు, రాజేష్, అక్బర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన మహమ్మద్ హుస్సేన్ బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటికి సమీపంలో ఉన్న మజీద్ దగ్గరకు నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి రాకపోవడంతో దీంతో కుటుంబ సభ్యులు హుస్సేన్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హుస్సేన్ అదృశ్యంపై సోదరుడు మక్బూల్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీధర్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి జడపల్లి శ్రీధర్‌కు డాక్టరేట్ వరించింది. తక్కువ ఓల్టేజీ అధిక శక్తి సమకాలిక బక్ కన్వర్టర్ రూపకల్పన, మోడలింగ్, విశ్లేషణలపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. వారణాసిలోని ప్రఖ్యాత ఐఐటీ (బీహెచ్‌ఐయూ) ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుడు ప్రొఫెసర్ మిత్రేష్ కుమార్ వర్మ దీనికి బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించినట్టు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య శుక్రవారం తెలిపారు. శ్రీధర్‌ను అదనపు ప్రొఫెసర్ డీఎస్.రావు, డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్-కోర్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్.శాస్త్రి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

ఎస్సీ విభాగం ఇన్‌చార్జిగా నరసింహ

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన దండోరా నరసింహను మెదక్ లోక్‌సభ ఎస్సీ విభాగ ఇన్‌చార్జిగా.. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన నరసింహ మాట్లాడుతూ, మెదక్‌లో పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.